


www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

మంగళవారం | 13 | జనవరి | 2026 | పేజీలు: 08


# సంస్కృతికి ప్రతిరూపం స్వామి వివేకానంద

## వివేకానంద యువతకు ఆదర్శం

## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట, అక్షిత ప్రతినిధి :** భారతీయ సంస్కృతిని, ఆధ్యాత్మికతను ప్రపంచ నలుమూలల చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కొనియడారు. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో జిల్లా యువజన సర్వీసులు, క్రీడా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొని వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ ..మిగతా 2లో



# పాలమూరుకు మహర్దశ

## రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులు

## 17న సీఎం రేవంత్ రాక

## సీఎం పర్యటనపై సమీక్ష

## మంత్రి జూపల్లి కృష్ణారావు





**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 17వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లాకు విచ్చేసి, సుమారు 1200 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ఐఐఐటి కళాశాల నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, శాశ్వత తాగునీటి సరఫరా, ఎంవిఎస్ కళాశాల భవన నిర్మాణం వంటి అత్యంత కీలక అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ కార్యక్రమాలు మహబూబ్‌నగర్ జిల్లా విద్యా, మౌలిక వసతుల అభివృద్ధికి మైలురాయిగా నిలవనున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సభా ఏర్పాట్లు, భద్రతా చర్యలు, మౌలిక సదుపాయాల కల్పన అంశాలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ..మిగతా 2లో

# పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

## విద్యుత్ అంతరాయం ఉండొద్దు

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి, అక్షిత ప్రతినిధి :** ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం ఇంటర్మీడియట్ ప్రాక్టిల్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ..మిగతా 2లో

# పుర ఎన్నికలకు సర్వం సిద్ధం

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ పై సోమవారం రాష్ట్ర ముఖ్య కార్యదర్శి రామకృష్ణ రావు మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవితో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్ల తో వీడియో ..మిగతా 2లో

# పంట పైరును దున్ని మట్టి పాలు

## రైతు కంట కన్నీరు పురుగు డబ్బాతో ఆందోళన

- తమకు న్యాయం చేయాలని మల్లు రైతులు బిక్షమారెడ్డి, వెంకట్ రెడ్డి
- వారసత్వంగా తమకు వచ్చిన భూమిని మల్లు వీరారెడ్డి కుటుంబీకులు అడ్డుకుంటున్నారని ఆరోపణ...
- ముడుపులు తీసుకొని అధికారులు తమకు న్యాయం చేయడం లేదని ఇక చావే శరణ్యం అంటూ పత్రికల ముందు గోడు వెల్లబోసుకున్న రైతులు

2





## పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

**మొదటి పేజీ తరువాయి...**

మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించాలని షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షలకు సకాలంలో చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులు పరీక్షల సమయానికి నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లు పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య మాట్లాడుతూ పరీక్షల వివరాలను వెల్లడించారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుండి 21వ తేది వరకు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు , మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో జనరల్, ఒకేషనల్ కలిపి ప్రాక్టికల్ పరీక్షలకు 5639 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. వారిలో ఇంటర్మీడియట్ జనరల్ ద్వితీయ సంవత్సరం 3360 మంది విద్యార్థులు, ఒకేషనల్ మొదటి, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 2279 పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. జిల్లాలో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు 29 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షల అనంతరం ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు మొదలై మార్చి 18వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పంట పైరును దున్ని మట్టి పాలు

**రైతు కంట కన్నీరు**

**పురుగు డబ్బాతో ఆందోళన**

**తమకు న్యాయం చేయాలని మల్లు రైతులు బిక్షమారెడ్డి, వెంకట్ రెడ్డి**

**వారసత్వంగా తమకు వచ్చిన భూమిని మల్లు వీరారెడ్డి కుటుంబీకులు అడ్డుకుంటున్నారని ఆరోపణ...**

**కోదాడ, అక్షిత ప్రతినిధి :** వారసత్వంగా వచ్చిన తమ పొలంలో సాగు చేసిన పచ్చని పైరును రాత్రికి రాత్రే దున్ని నాశనం చేశారని కోదాడ పరిధిలోని శ్రీరంగపురానికి చెందిన రైతులు మల్లు బిక్షా రెడ్డి, వెంకటరెడ్డిలు కుటుంబ సభ్యులతో కలిసి పురుగుమందు డబ్బాలతో పొలం వద్ద ఆందోళనకు దిగారు. వారసత్వంగా వచ్చిన తమ భూమిని మల్లు వీరారెడ్డి కుమారులు మల్లు వెంకటరెడ్డి, సైదిరెడ్డి,ఏసి రెడ్డిలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గత కొంతకాలంగా ఈ వివాదం జరుగుతుందని ఇదే విషయాన్ని కోదాడ ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇటీవల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సర్వే చేసి ఆ 30 కుంటల భూమి తమది అని రిపోర్టు కూడా ఇచ్చారన్నారు. కాగా కొందరి ఒత్తిడి ప్రలోభాలకు లొంగి ఎమ్మార్వో ఆర్ఐ రాసిన రిపోర్టును మార్చి ఈ భూమి తమకు చెందకుండా నివేదికల రూపొందించారని కన్నీరు మున్నిరయ్యారు. ఈ విషయం కలెక్టర్ కు కూడా ఫిర్యాదు చేశానన్నారు. ఇటీవల కాలంలో తమపై దాడులు కూడా జరగడంతో పోలీసులకు మరణ వాంగ్మూలంతో కూడా ఆశ్రయించామని అయినప్పటికీ పోలీసు అధికారులు సైతం తమకు న్యాయం చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. తమపై దాడి చేసి ఆక్రమించుకోవాలని చూస్తున్న వారిపై అధికారులు నాయకుల ఒత్తిడితో ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని వాపోయారు. భూ రికార్డుల ప్రకారం గతంలో వారి బాగా పంపిణీ వచ్చిన భూమి ఎన్ఎస్పీ కాల్వ కింద పోయిందని వీరు అదే పోయిన భూమిని అధికారులకు ముడుపులు అప్పగించి రికార్డు లోకి ఎక్కించుకుని తమ భూమి పైకి దౌర్జన్యంగా వస్తున్నారని కలెక్టర్ జోక్యం చూసుకొని విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో కుటుంబ సభ్యులతో కలిసి కోదాడ ఎమ్మార్వో కార్యాలయం ముందు పురుగుమందు తాగి ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప మరో దారి లేదని వాపోయారు.

# పాలమూరుకు మహర్దశ

**మొదటి పేజీ తరువాయి...**

ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, , జిల్లా స్థాయి అధికారులు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్మాత్మకమైనదని, సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని





శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. సభా ప్రాంగణం, వేదిక ఏర్పాట్లు, రహదారుల అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, పారిశుధ్య చర్యలు, భద్రత వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనతో మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి మరింత ఊతం లభించనుందని, సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని అధికారులను కోరారు. సీఎం పర్యటనను విజయవంతం చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులు ఇప్పటివరకు చేపట్టిన ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు సమర్పించగా, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. సమావేశం అనంతరం, ఐఐఐటి కళాశాల నిర్మాణం చేపట్టనున్న చిట్టబోయినపల్లి ప్రాంతాన్ని, అలాగే ముఖ్యమంత్రి సభ నిర్వహించనున్న ఎంవిఎస్ కళాశాల ప్రాంగణాన్ని ఎమ్మెల్యేలు, అధికారులు కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,ఆర్ డిఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# పుర ఎన్నికలకు సర్వం సిద్ధం

**మొదటి పేజీ తరువాయి...**

కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల నిర్వహణ పై పలు సూచనలు చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి – కలెక్టర్ వెంకటేష్ ధోత్రే హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డులు, కాగజ్ నగర్ మున్సిపాలిటీలో 30 వార్డులలో ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితా ప్రకటన, ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా,



తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రకటించి, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందులో భాగంగా జోనల్ అధికారులు, ఫ్లయింగ్, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాల ఏర్పాటు, నోడల్ అధికారుల నియామకం, సెక్టోరియల్ అధికారులు, నామినేషన్ స్వీకరణ కేంద్రాలు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు చేసి మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతికి ప్రతిరూపం స్వామి వివేకానంద

**మొదటి పేజీ తరువాయి...**

సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ “లేవండి, మేల్కొనండి,గమ్యం చేరే వరకు విశ్రమించకండి” అన్న వివేకానందుని పిలుపు నేటి తరం యువతకు దిక్సూచి అని కొనియాడారు. విదేశాల్లో సైతం భారత దేశ ఔనత్యాన్ని చాటి చెప్పిన ఆయన ధైర్యం, ఆత్మవిశ్వాసం ప్రతి ఒక్కరూ అలవర్చు కోవాలని పిలుపునిచ్చారు. తక్కువ వయస్సులోనే ఎక్కువ విజయాలు సాధించి ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన స్వామి వివేకానంద ఆలోచనలకు అనుగుణంగా వారు చూపిన మార్గాలలో నడుస్తూ యువత చదువు, క్రీడలు, ఐటి, సైన్స్, టెక్నాలజీ, ఏఐ లాంటి ఆసక్తి ఉన్న రంగాలలో వినూత్నంగా ఆలోచించి దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. నీది,నాది అని కాకుండా సమాజం గురించి అలోచించి సమస్యలను పరిష్కరించే ప్రతి ఒక్కరు స్వామి వివేకానంద స్పూర్తిగా తీసుకున్న వారందరు యువతే అని అన్నారు. భారత దేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కల్గిన దేశం అని,ఆర్థిక వ్యవస్థ లో 4వ స్థానానికి చేరుకుందని నైపుణ్యాలను




పెంపొదించుకుంటూ సామర్థ్యలను పెంచుకొని, మంచి ఆలోచనలతో ముందుకు వెళ్తే సమాజంలో గుర్తింపు దక్కటంతో పాటు మన ఊరు, మండలం, జిల్లా, రాష్ట్రము, దేశంలను అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. జిల్లా ఎస్పి కే. నరసింహ మాట్లాడుతూ స్వామి వివేకానంద జన్మ దినోత్సవంను జాతీయ యువజన దినోత్సవనీగా జరపటం సంతోషమని,అతి చిన్న వయసులోనే భారతదేశ ఔనత్యాన్ని విదేశాలకు తెలియజేసిన మహోన్నతమైన వ్యక్తి అని,భారతదేశంలో 60 శాతానికి పైగా యువతే ఉన్నారని,యువత భారత దేశానికి గొప్ప వనరులు అని వారిని ఉన్నతంగా తీర్చిదిద్దితే భారతదేశం ప్రపంచ దేశాల్లో మొదటి స్థానానికి చేరుకుంటుందని అన్నారు. యువత మత్తు కోసం మాదక ద్రవ్యాల వైపు,ఈజీ మనీ కోసం సైబర్ క్రైమ్ వైపు వెళ్లకుండా యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, నేర రహిత సూర్యాపేటగా తీర్చిదిద్దేందుకు యువత అందరూ కలిసి రావాలని కోరారు. అనంతరం స్వామి వివేకానంద దినోత్సవం సందర్భంగా కళాశాలలో నిర్వహించిన వ్యాస రచన, వ్యక్తిత్వం, క్విజ్ పోటీలలో ప్రతిభ చూపెట్టిన వారికి కలెక్టర్, ఎస్పి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎస్‌ఓ వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి,తహసీల్దార్ కృష్ణయ్య, మాజీ మన్సిపల్ చైర్మన్లు జుట్టుకొండ సత్యనారాయణ,అన్నపూర్ణ, వివేకానంద ఉత్సవ కమిటీ చైర్మన్ నాగార్జున,కార్యదర్శి ప్రభాకర్,సభ్యులు,పుర ప్రముఖులు,యువత, తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



# సామాజిక ఐక్యతకు ప్రతీకలు.. టెంపుల్స్

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



మహబూబ్ నగర్, అక్షిత న్యూస్ : మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 37వ డివిజన్ సద్దలగుండు ప్రాంతంలో గల ×శ్రీ అభయాంజనేయ స్వామి× దేవాలయ ప్రాంగణంలో ముడా నిధులు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన షెడ్‌ను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముందుగా ఆలయ నిర్వాహకులు మరియు భక్తులు ఎమ్మెల్యే గారికి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ అభయాంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మహబూబ్‌నగర్ నగర ప్రజల శ్రేయస్సు, శాంతి?సమృద్ధుల కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే



మాట్లాడుతూ, దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలుగా మాత్రమే కాకుండా, సమాజాన్ని ఐక్యంగా నిలిపే సామాజిక ఐక్యతకు ప్రతీకలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన ప్రభుత్వ బాధ్యతగా భావిస్తూ, ముడా నిధులతో ఈ షెడ్ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ షెడ్ ద్వారా వేసవి మరియు వర్షాకాలాల్లో భక్తులు ఎలాంటి అసౌకర్యం లేకుండా స్వామివారి దర్శనాలు చేసుకునే అవకాశం కలుగుతుందని అన్నారు.

మహబూబ్‌నగర్ నగర అభివృద్ధితో పాటు దేవాలయాల అభివృద్ధికి కూడా తమ వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పత్రాలను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. అలాగే నగరాన్ని పరిశు భ్రంగా ఉంచుకోవాలనే సంకల్పంతో ఎస్బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి రెండు చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం ముడా నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ స్వప్న, నాయకులు సీజే బెనహర్, సామ్యెల్ దాసరి, వెంకటాచారి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు పుల్లయ్య, రాములు, రాం కిషన్, శ్రీను, సాయిలు, సత్యనారాయణ, భూపాల్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# గ్రామీణ వైద్యుల సేవలు వెలకట్టలేనివి

**తెలంగాణ గ్రామీణ వైద్యుల సమాఖ్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్, ప్రముఖ న్యాయవాది మేకల సుగుణారావు**

**ఘనంగా ఖమ్మం జిల్లా ప్రథమ మహాసభ క్యాలెండర్ ఆవిష్కరణ**





ఖమ్మం/అక్షిత బ్యూరో : గ్రామీణ వైద్యుల సేవలు వెలకట్టలేనివని 'తెలంగాణ గ్రామీణ వైద్యుల సమాఖ్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్ ప్రముఖ న్యాయవాది మేకల సుగుణారావు అన్నారు. ఖమ్మం నగరం మమత మెడికల్ కాలేజ్ రోడ్ సివిఆర్ ఫంక్షన్ బాంకెట్ హాల్లో ఆదివారం తెలంగాణ గ్రామీణ వైద్యుల సమాఖ్య సంఘం ఖమ్మం జిల్లా ప్రథమ మహాసభ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామీణ వైద్యులు ప్రాథమిక వైద్య సేవలు అందిస్తూ అత్యవసర పరిస్థితుల్లో రోగులను పట్టణాల్లోని ఆసుపత్రులకు తరలించి వారి ప్రాణాలను కాపాడడంలో వారి సేవలు మరువలేనివన్నారు. వారి సేవలను గుర్తించి గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం నుండి తగిన గుర్తింపు రక్షణ కల్పించాలని వారు కోరారు. ప్రభుత్వం ఏర్పడకు ముందు రాజకీయ పార్టీలు వారి మేనిఫెస్టోలో పెట్టిన గ్రామీణ వైద్యుల నిబంధనలను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలలో గ్రామీణ వైద్యులకు ప్రత్యేక ప్రాధాన్యతను కల్పించాలని కోరారు. గతంలో ముఖ్యమంత్రిగా రాజశేఖర్ రెడ్డి గ్రామీణ వైద్యులకు ప్రత్యేక శిక్షణ గుర్తింపు నిచ్చిన మాదిరిగా ప్రస్తుత ప్రభుత్వం కూడా గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇప్పించి తగిన గుర్తింపు నివ్వాలని కోరారు. గ్రామీణ వైద్యుల పై జరుగుతున్న దాడులను తక్షణమే ఆపాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ వైద్యుల సమాఖ్య సంఘం సంఘంలో ఉన్న ప్రతి సభ్యునికి 10 లక్షల రూపాయల ప్రమాద బీమా (టర్మ్ ఇన్సూరెన్స్) బాండ్లను అందజేయడం జరిగింది. అనారోగ్యానికి గురైన గ్రామీణ వైద్యులు ఘట్టం వంశీ గంట మణిరాజు లకు మహాసభలో ఆర్థిక సహాయాన్ని అందించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గ్రామీణ వైద్యులపై దాడులు చేసిన అక్రమ కేసులు బనాయించిన వారికి అండగా ఉండి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తానని సభాముఖంగా ప్రముఖ న్యాయవాది మేకల సుగుణారావు హామీ ఇచ్చారు. ఈ మహాసభలో జిల్లా అధ్యక్షులు మద్రి నరేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరు నరసింహారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నారపోగు వీరభద్రం రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నవరపు నగేష్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దొడ్డ శ్రీనివాసరావు జిల్లా ఉపాధ్యక్షులు చాపలమడుగు నాగేశ్వరావు జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు సుధాకర్ జిల్లా అధికార ప్రతినిధి షేక్ సిద్ధు జిల్లా గౌరవ అధ్యక్షులు శీలం బాలకృష్ణారెడ్డి

జిల్లా సాంస్కృతిక అధ్యక్షులు తుప్పతి శ్రీనివాసరావు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మారుతి సంపత్ జిల్లా న్యాయ సలహాదారి కాకటి కరుణాకర్ జిల్లా సహాయ కార్యదర్శి బోయినపల్లి రమేష్ జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ సైదా జిల్లా కోశాధికారి కమర్తపు వీరనాగేశ్వరావు జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ అల్లావుద్దీన్ ఖమ్మం పట్టణ ప్రముఖులు కొరిపల్లి శ్రీనివాస్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్‌లో కేటీఆర్‌కు ఘన స్వాగతం

**జన సందోహంలో కాన్వాయ్ నుండే అంజన్న ఎక్కడ అంటూ దగ్గరికి తీసుకున్న కేటీఆర్**



షాద్ నగర్, అక్షిత ప్రతినిధి : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ బైపాస్ కేశంపేట రోడ్డులో మహబూబ్ నగర్ వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు షాద్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆరు మండలాల నుండి పట్టణం నుండి కార్యకర్తలు కేటీఆర్ కు ఘన స్వాగతం పలికారు.ఆ ప్రాంతమంతా జనసందోహంగా మారిపోవడంతో కాన్వాయ్ నుండే కేటీఆర్ అంజన్న ఎక్కడ అంటూ దగ్గరికి తీసుకున్నారు.. ఇంతలోనే కార్యకర్తలు పెద్ద ఎత్తున సీఎం సీఎం అంటూ నినాదాలు చేశారు ఈ సందర్భంగా కేశంపేట మాజీ ఎంపీపీ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ మాట్లాడుతూ కేవలం ఒక్క చిన్న పాటి మెసేజ్ తోనే కేటీఆర్ కు స్వాగతం పలికేందుకు కార్యకర్తలు ఇంత పెద్ద ఎత్తున వస్తున్నారంటే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను ఎంత మేరకు మోసం చేస్తుందో అర్థమవుతుందన్నారు. ఇది బహిరంగ సభ కాదన్నారు కేవలం కేటీఆరకు స్వాగతం పలికేందుకే ఒక్క మెసేజ్ ద్వారా ఇంత పెద్ద ఎత్తున జనసందోహంతో నిండిపోయిందన్నారు భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు...

# యువతకు స్ఫూర్తి వివేకానంద

**మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్ భాస్కర్**





కాజీపేట్, అక్షిత ప్రతినిధి : భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని పశ్చిమ నియోజవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్ అధ్యక్షతన నిర్వహించగా, దాస్యం విజయ్ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదట స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా దాస్యం విజయ్ భాస్కర్ మాట్లాడుతూ యువతలో స్ఫూర్తిని నింపిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు.భారత దేశ హైందవ ధర్మాన్ని, భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప తత్వవేత్త అని అన్నారు.మనిషికి వ్యక్తిత్వ వికాసాన్ని, సామాజిక బాధ్యతలను తన ఆచరణల ద్వారా బోధించిన మహనీయుడు స్వామి వివేకానంద అని తెలిపారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు చెన్నం మధు, సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు దూలం వెంకన్న, జానకీ రాములు, సల్వాజీ రవీందర్ రావు, కోటేశ్వర్ రావు, ఖలీల్, మాటిక రాజు యాదవ్, బోడ దశరథం, తక్కళ్లపల్లి వినీల్ రావు, ఇమ్మడి లోహితా రాజు, సౌరం రఘు, ఆదిత్య యాదవ్, రాజ్ కుమార్, అనిల్, ఉదయ్, అభి తదితరులు పాల్గొన్నారు.

## తపస్ అధ్యక్ష, కార్యదర్శులకు అభినందనలు



**కొడిమ్యాల, అక్షిత న్యూస్ :** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్)రాష్ట్ర అధ్యక్షులుగా వొద్నాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా పెంటయ్యలు ఏకగ్రీవనీగా ఆదివారం కొడిమ్యాల మండల తపస్ అధ్యక్షులు ఏనుగు ఆదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అంకం రాజగంగయ్య, రాష్ట్ర కార్యదర్శి వీరమల్ల వెంకటరమణరావు, జిల్లా కార్యదర్శి గోనెపల్లి శ్రీనివాస్, జిల్లా మహిళా కన్వీనర్ శ్రావణి, మండల బాధ్యులు వారికి అభినందనలు తెలిపారు.

## యువతను క్రీడలకు ప్రోత్సహిస్తున్న యువ సర్పంచ్




**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బోగారం గ్రామ సర్పంచ్ కునూరు సాయికుమార్ గౌడ్ సంక్రాంతి సంబరాలలో భాగంగా యువతను మహిళలను సంక్రాంతి క్రీడలకు తన వంతు ఉత్సాహం అందిస్తూ యువతకు ఉత్తేజాన్ని అందిస్తున్నారు. మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు యువతకు క్రికెట్ టోర్నమెంట్ తన సొంత నిధులతో నిర్వహిస్తున్నారు, గ్రామంలో యువతకి క్రీడలకు గ్రౌండ్ క్లీనింగ్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేయడం జరిగింది, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడలలో కూడా నైపుణ్యత సాధించాలని గ్రామ యువత పలువురికి ఆదర్శప్రాయంగా ఉండాలని ఈ సందర్భంగా అన్నారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యతనివ్వాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**ప్రజావాణి కార్యక్రమానికి 110 అర్జీలు**



**హనుమకొండ, అక్షిత ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలను పరిష్కరించేందుకు అధికారులు పఅత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమస్యలను పరిష్కరించాలని జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ను నేరుగా కలిసి విన్నవిస్తూ అర్జీలను అందజేశారు. ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తూ వారు చెప్పిన అంశాలను కలెక్టర్ ఓపికగా విన్నారు. అక్కడే ఉన్న సంబంధిత శాఖల అధికారులను అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు మండలాల తహసిల్దార్లతోనూ ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోసం 110 అర్జీలను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సేవల్లో యువత పాత్ర కీలకం

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**17న సీఎం చేత రూ.1200 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి :** సేవా కార్యక్రమాల్లో యువత పాత్ర అత్యంత కీలకమని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ పేర్కొన్నారు. విగ్నేశ్వర వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, గోవర్ధన్ గౌడ్ సహకారంతో మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని విగ్నేశ్వర కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ ఎన్నికలు త్వరలో జరగనున్నాయని తెలిపారు. మన మున్సిపల్ కార్పొరేషన్‌ను ముఖ్యమంత్రికి



బహుమతిగా ఇవ్వాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ ఏకమై పనిచేయాలని పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ బిడ్డే ముఖ్యమంత్రి స్థానంలో ఉండటం వల్ల నగర అభివృద్ధికి అవసరమైన నిధులు సులభంగా సమకూరుతున్నాయని, ఈ నెల 17వ తేదీన ముఖ్యమంత్రి చేత రూ.1200 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరగనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత రక్తదానం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతో మంది ప్రాణాలను కాపాడుతుందని, ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయడం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. రక్తదానం చేసిన ప్రతి దాతను ప్రత్యేకంగా అభినందిస్తూ, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముందు భారతదేశ యువతకు స్ఫూర్తినిచ్చిన మహనీయుడు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. స్వామి వివేకానంద ఆశయాలను యువత ఆచరణలో పెట్టి, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజాభివృద్ధికి దోహదపడాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ ఉచిత రక్తదాన శిబిరంలో పెద్ద సంఖ్యలో యువతతో పాటు కాలనీ వాసులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. నిర్వాహకులు చేసిన ఏర్పాట్లపై పాల్గొన్నవారు సంతృప్తి వ్యక్తం చేస్తూ విగ్నేశ్వర వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు సిజె బెనహర్, సంజీవరెడ్డి, అహ్మద్ ఖాన్, రమేష్ రెడ్డి, గంగిరెడ్డి, టీఎన్జీవో రాజీవ్ రెడ్డి, విగ్నేశ్వర వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి చంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా కొమ్ము కృష్ణ

**కొమ్ము కృష్ణను సన్మానించిన..**

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి :** జిల్లాలో సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా అందరిని ముందుకు నడిపించాలని, ప్రభుత్వ సహాయ సహకారాలు వెన్నుదన్నుగా నిలుస్తాయని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం షాద్ నగర్ లో ఎమ్మెల్యే స్వగృహంలో రంగారెడ్డి జిల్లా సర్పంచ్ ల సంఘం నూతన అధ్యక్షుడు కొమ్ము కృష్ణ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఎమ్మెల్యేకు సర్పంచ్ కొమ్ము కృష్ణ కండువా కప్పి సన్మానించారు. పూల బొకే అందజేసిన అనంతరం ఎమ్మెల్యే శంకర్ అధ్యక్షుడు కొమ్ము కృష్ణకు శాలువాతో సత్కరించి అభినందించారు. గ్రామ స్వరాజ్యాలకు బాటలు వేస్తూ సర్పంచుల సారధిగా ముందుకు నడిపించాలని ఈ క్రమంలో తన సహాయ సహకారాలు ఎల్లవేళలా పుష్కలంగా అందిస్తానని తెలిపారు. సర్పంచులను రాజకీయాల్లో కతీతంగా సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని గ్రామ సమస్యలలో తలెత్తుతున్న వాటిని పరిష్కరించి ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కొమ్ము కృష్ణ మాట్లాడుతూ తనపై గురుతరమైన బాధ్యత పెట్టినందుకు సంఘానికి ధన్యవాదాలు తెలియజేసుకుంటూ ఎమ్మెల్యే సహాయ సహకారాలు ఎల్లవేళలా తనకు ఉండాలని ఆ విధంగా ఆశీర్వదించాలని కొమ్ము కృష్ణ కోరారు. పలువురు నాయకులు కొమ్ము కృష్ణకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు..

## వివేకానంద జీవితం యువతకు ఆదర్శం

**సోమిడిలో ఘనంగా వివేకానంద జయంతి**



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని సోమిడిలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం బీజేపీ 62వ డివిజన్ అధ్యక్షుడు మేకల శ్రావణ్ యాదవ్ ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.

ఈ సందర్భంగా శ్రావణ్ యాదవ్ మాట్లాడుతూ వివేకానంద జీవితాన్ని, వారి ప్రసంగాలను యువత స్ఫూర్తిగా తీసుకొని దేశ పురోగతికి కృషి చేయాలని పిలుపునివ్వడం జరిగింది.ప్రతి ఏటా జనవరి 12న స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుంది అని తెలిపారు.భారతదేశ యువతకు స్ఫూర్తినిచ్చే, దేశాభిమానం, ఆత్మవిశ్వాసం, సేవా భావనలను పెంపొందించే ప్రత్యేకమైన రోజు జాతీయ యువజన దినోత్సవం అని తెలిపారు. కార్యక్రమంలో పిపిసిపిఎస్ డైరెక్టర్ కాయిత రాజ్ కుమార్ యాదవ్, బండి భిక్షపతి, గొర్రె శంకర్, రాజు, నిరంజన్, చందు,విజయ్, వరుణ్, హేమలత, ప్రణవి తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



## క్రీడా ప్రతిభకు సీఎం కప్ పోటీలు

# సువర్ణ అవకాశం

### జిల్లా కలెక్టర్



**వరంగల్, అక్షిత బ్యూరో:** యువత తమ క్రీడా ప్రతిభను కనబరచడానికి సీఎం కప్ పోటీలు సువర్ణ అవకాశమని ఈ పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు.

సోమవారం ఖిలా వరంగల్ లోని ఖుష్ మహల్ వద్ద సీఎం కప్ రెండవ ఎడిషన్ టార్చ్ ర్యాలీ ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జెండా ఊపి ప్రారంభించగా, ర్యాలీ నూతనంగా నిర్మిస్తున్న ఐడిఓసి కలెక్టరేట్ వరకు కొనసాగించారు.

ఈ సందర్భంగా స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తదితరులు నివాళులు అర్పించారు. యువత లక్ష్య సాధనలో స్వామి వివేకానందుని మార్గాన్ని అనుసరించాలని అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రూరల్ నుండి గ్లోబల్ ఛాంపియన్ నినాదంతో గ్రామీణ స్థాయి క్రీడాకారులలో ప్రతిభను వెలికి తీయడం కోసం సీఎం కప్ రెండవ ఎడిషన్ సరైన వేదిక అని ఈ అవకాశాన్ని గ్రామీణ, మండల, జిల్లా స్థాయి యువత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



ఈ క్రీడాపోటీలకు సంబంధించిన అవగాహన కల్పించడానికి జిల్లా కేంద్రం తో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో సీఎం కప్ టార్చ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమా దామోదర్ యాదవ్, ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సుమా, జిల్లా యువజన క్రీడ అధికారి అనిల్ , డిపిఆర్ఓ ఆయూబ్ అలీ, జిల్లా పశు సంవర్ధక అధికారి బాలకృష్ణ, తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి కైలాష్ యాదవ్ , 4వ బెటాలియన్ ఇన్స్ట్రక్టర్ రాంప్రసాద్, సుధాకర్, కార్యదర్శి కైలాష్ యాదవ్, జిల్లా క్రీడల అధ్యక్ష కార్యదర్శులు, ఇతర అధికారులు, పీడీలు, పిఈటి లు , కోచ్ లు , తదితరులు పాల్గొన్నారు.


## డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను

# వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలి

### కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



**కోదాడ అక్షిత ప్రతినిధి:** కోదాడ పట్టణంలోని బాలాజీ నగర్‌లో నిర్మాణం పూర్తై రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ మౌలిక సదుపాయాల లేమితో లబ్ధిదారులకు అందకుండా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే నివాసయోగ్యంగా మార్చి అప్పగించాలంటూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కోదాడ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ ధర్నాలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని అనంతరం లబ్ధిదారులతో కలిసి కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ .. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కోదాడ



పట్టణంలోని బాలాజీ నగర్‌లో రెండు విడతలుగా 560 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి, 2023లోనే అధికారుల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక, పంపిణీ ప్రక్రియ కూడా పూర్తి చేసిందన్నారు. అయితే ఎన్నికల అనంతరం మౌలిక సదుపాయాల కల్పనను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల లబ్ధిదారులు ఇప్పటికీ అద్దె ఇళ్లలోనే నరకప్రాయమైన జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం అద్దె ఇళ్లలో నివసిస్తున్న అతి పేద కుటుంబాలు అనారోగ్యం, వృద్ధాప్యం కారణంగా మరణించిన సందర్భాల్లో కూడా ఇళ్ల యజమానులు మృతదేహాలను ఉంచేందుకు అనుమతించని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.వందల కోట్లతో కోదాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్న ఉత్తమ్ పద్మావతి దనీపతులు కనీసం పేద ప్రజల కోసం 50 లక్షలనిధులు కేటాయించలేకపోతున్నారా అని ప్రశ్నించారు.

వెంటనే బాలాజీ నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలకు నిధులు మంజూరు చేసి, ఇళ్లను నివాసయోగ్యంగా మార్చి లబ్ధిదారులకు అప్పగించకపోతే, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ నహీం, లబ్ధిదారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వడ్డే ఓబన్న 219వ జయంతి వేడుకలు



**నకిరేకల్ అక్షిత ప్రతినిధి:** చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న జయంతి కార్యక్రమంలో చిత్రపటానికి పూలమాలవేసి సంఘా నాయకులు నివాళులర్పించారు . ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ ఓర్సు సైదులు మాట్లాడుతూ వడ్డే ఓబన్న తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి వీరుడు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ప్రాణ స్నేహితుడు, సేనాధిపతి; బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కీలక పాత్ర పోషించి వ్యక్తి అని , 1840లలో దేశ స్వాతంత్ర్యానికి పునాది వేసిన యోధుడు, వడ్డెర కులస్థుడని వారు అన్నారు. బ్రిటిష్ వారి దోపిడీ , పన్నుల విధానాలకు వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి పోరాడారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నీలకంఠనీ లింగస్వామి , మాజీ వార్డ్ మెంబర్ ఓర్సు శ్రీను నాయకులు శిరస్సు ఇద్దయ్య , శిరస్సు వెంకన్న , నీలకంఠం నరేష్ , శిరస్సు కృష్ణ , ఓర్సు స్వామి , మరియు సంఘం నాయకులు గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

## స్వామి వివేకానంద జయంతి సందర్భంగా కుత్బుల్లాపూర్‌లో రక్తదాన శిబిరం





**అక్షిత న్యూస్ / గాజులరామరం:** స్వామి వివేకానంద 164వ జయంతిని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పెద్ద ఎత్తున బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని రక్తదానం చేసారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద యువతకు మార్గదర్శకుడని, దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన బోధనలు తెలియజేస్తున్నాయని అన్నారు. రక్తదానం ద్వారా సమాజానికి సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి, జనరల్ సెక్రెటరీ గిరివర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు గరిగే శేఖర్, డివిజన్ అధ్యక్షులు మణికంఠతో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అలాగే భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, స్థానిక యువత హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

స్వామి వివేకానంద ఆశయాలను ఆచరణలో పెట్టాలని, సమాజ సేవే లక్ష్యంగా ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** భారతీయ జనతా పార్టీ మునిపంపుల గ్రామ శాఖ అధ్యక్షుడు తెల్కలపల్లి గిరి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 163 వ జయంతి ఘనంగా నిర్వహించరు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా మాజీ ఉపాధ్యక్షులు యాదాసు లక్ష్మణ్ కుమార్( రెండవ వార్డ్ నెంబర్) మాట్లాడుతూ ఆయన ఆశయ స్ఫూర్తి తో యువత ముందుకు నడవాలని యువత దేశానికి వెన్నుముకని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ ప్రధానమంత్రి యువ వికాస్ లాంటివి దేశానికి స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు డోగిపర్తి భాస్కర్, ఏలూరు రవి, చోల్లేటి చంద్ర శేఖరా చారి, బూడిద కిరణ్ సురేపల్లి వీరేందర్ పున్న శ్రీకాంత్, బుడద చింటూ, బేతు ధర్మేందర్, గాదే శ్రీకాంత్, సూరపల్లి నరేష్, మామిండ్ల రామ్, నాగేందర్, కూరెల్ల రామకృష్ణ చారి, మధు, కానుకుంట్ల నరేష్, మారయ్య, ప్రశాంత్, మిరియాల వెంకటేష్, ఏలూరి నిహారిక తదితరులు పాల్గొన్నారు

## వివేకానంద మాటలు యువతకు స్ఫూర్తి

**అదనపు డీసీపీ సురేష్ కుమార్**



**వరంగల్, అక్షిత బ్యూరో:** స్వామి వివేకానందుడి మాటలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిస్తాయని అదనపు డీసీపీ సురేష్ కుమార్ తెలిపారు. స్వామి వివేకానంద జయంతి వేడుకలను వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులు సిబ్బంది వివేకానందుడు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ ఏ ఆర్ మాట్లాడుతూ భారత దేశ ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేసిన చైతన్య మూర్తి స్వామి వివేకానందుడని పేర్కొన్నారు.

వివేకానందుడికి నివాళులు అర్పించిన వారిలో అదనపు డీసీపీలు ప్రభాకర్ రావు, శ్రీనివాస్, ఏసీపీలు డేవిడ్ రాజు, జాన్ నర్సింహులు, నాగయ్య, అంతయ్య, ఆర్.ఐ లు స్పర్జన్ రాజ్, శ్రీధర్, సతీష్, చంద్ర శేఖర్,ఇన్స్ స్పెక్టర్ మల్లయ్య,ఆర్.ఎస్. ఐ శ్రవణ్ కుమార్ తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పలు అంశాలపై అవగాహన



**ఆత్మకూర్(ఎం)అక్షిత న్యూస్:** మండల కేంద్రంలోని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశానుసారం..తెలంగాణ గ్రామీణ వికాస బ్యాంక్,తాసిల్దార్ కార్యాలయం సమీపంలో బాల్య వివాహాల పై,రోడ్ భద్రత గురించి అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు,ఈ కార్యక్రమం లో పారా లీగల్ వాలంటరీ కానుగంటి శ్రీశైలం,ఎండి మౌలానా,విజయలక్ష్మి,ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు,

# మున్సిపాలిటీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి, అక్షిత ప్రతినిధి :** జిల్లాలో మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. సోమవారం హైదరాబాదు నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వనపర్తి జిల్లా కలెక్టరేట్లోని కన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో పాటు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి ఎస్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలకు కలెక్టర్లు అంతా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈరోజు వార్డు వారీగా ఫోటోలతో కూడిన ఓటర్ తుది జాబితా ప్రదర్శించడంతోపాటు, 16వ తేదీ నాడు పోలింగ్ కేంద్రాల వారిగా ఓటర్ తుది జాబితాలను ప్రదర్శించాల్సి ఉంటుందని సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే రిటర్నింగ్ ఆఫీసర్లు, ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి బృందాలను నియమించేలా అన్ని సిద్ధం చేసుకోవాలన్నారు.



రిజర్వేషన్ కు సంబంధించి 2024లో నిర్వహించిన సామాజిక ఆర్థిక జనాభా సర్వే డేటా ఆధారంగా, మహిళలకు సంబంధించి 50% రిజర్వేషన్లను లాటరీ పద్ధతి ద్వారా, ఎస్సీ ఎస్టీల రిజర్వేషన్లు 2011 సెన్సస్ ఆధారంగా ఖరారు చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఎన్నికల్ని సజావుగా పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈరోజు వార్డుల వారీగా ఓటర్ తుది జాబితా ప్రదర్శించడం జరిగిందన్నారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ లకు పుర ఎన్నికలపై దిశా నిర్దేశం చేస్తూ ఓటర్ జాబితాను అన్ని గుర్తింపు పొందిన పార్టీలకు సమర్పించి అక్విటెన్స్ తీసుకోవాలన్నారు. ఈరోజు ప్రదర్శించిన జాబితాపై ఏమైనా అభ్యంతరాలు వస్తే స్వీకరించి పరిష్కరించాలని సూచించారు. అనంతరం 16వ తేదీన పోలింగ్ కేంద్రాల వారీగా ఫోటోలతో కూడిన ఓటర్ జాబితా ప్రదర్శించాలని ఆదేశించారు. ఓటర్ జాబితాలో చనిపోయిన వారి ఓట్లను, గ్రామీణ ఓట్లను జాగ్రత్తగా అన్ మ్యాప్ చేయాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ కోసం మున్సిపల్ కమిషనర్లు ఎంపిక చేసుకున్న భవనాల్లో ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఎంపిక చేసుకున్న భవనాలను మున్సిపల్ కమిషనర్లు ప్రత్యక్షంగా వెళ్లి సందర్శించి అక్కడ సదుపాయాలను తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# రెండు రాష్ట్రాలకు వారధిగా పెరిక భవన్ నిర్మాణం చేయాలి

**రాష్ట్రంలో పెరిక కుల కార్పొరేషన్ ఏర్పాటుకు నా వంతు కృషి చేశాను**

**ముత్తినేని వీరయ్య**



**కోదాడ అక్షిత ప్రతినిధి:** పెరిక సంఘం పెద్దలు జుట్టుకొండ సత్యనారాయణ, అంగిరేకుల నాగార్జున సహకారంతో పెరిక భవన నిర్మాణం రెండు రాష్ట్రాలకు వారధిగా జాతీయ రహదారి 65 పై ఉండబోతుందని పెరికకుల ముద్దుబిడ్డ, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. కోదాడ పెరిక హాస్టల్ భవనంలో ఏర్పాటుచేసిన సూర్యాపేట జిల్లా కుల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సూర్యాపేట జిల్లా పెరిక సంఘం అధ్యక్షుడిగా సముద్రాల రాంబాబును ఏకగ్రీవంగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. తాను సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా ఉంటూ పార్టీ అధినాయకులతో మాట్లాడి మన కులానికి కార్పొరేషన్ ఇస్తామని మేనిఫెస్టోలో చేర్చిన తర్వాతనే తాను ప్రచారానికి వెళ్లినట్లు తెలిపారు. అధికారం చేపట్టిన తర్వాత తమ కులానికి అనుకున్న ప్రకారం పెరిక కార్పొరేషన్ ఇవ్వాలని కోరగా కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. కాంగ్రెస్ అధినాయకులు మీకు వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ కావాలా పెరికల కార్పొరేషన్ చైర్మన్ కావాలా అని అడిగితే తాను పెరిక కార్పొరేషన్ చైర్మన్ పదవి కోరుకుంటే మన కులానికి చెందిన మరొకరికి పదవి వచ్చే అవకాశం ఉండదని ఆలోచించి మన కులానికి మరో కార్పొరేషన్ పదవి రావాలని ఆలోచనతో తాను వికలాంగుల కార్పొరేషన్ పదవి కోరుకున్నట్లు తెలిపారు.

అనంతరం జిల్లా పెరిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

సూర్యాపేట జిల్లా పెరిక సంఘం అధ్యక్షులుగా సముద్రాల రాంబాబు గౌరవ అధ్యక్షులుగా వనపర్తి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పత్తిపాక జనార్దన్, యూత్ కమిటీ అధ్యక్షులుగా బుడిగం కిరణ్ కుమార్ లను నియమించినట్లు తెలిపారు. అలాగే సూర్యాపేట పెరిక భవన్ నిర్మాణ కమిటీ గౌరవ సలహాదారులుగా ముత్తినేని వీరయ్య, జుట్టుకొండ సత్యనారాయణ, అంగిరేకుల నాగార్జున, దొంగరి వెంకటేశ్వర్లు, సుంకరి అజయ్ కుమార్, రామినేని శ్రీనివాసులను నియమించారు. వీరంతా ఇతర కమిటీలను ఏర్పాటు చేసుకొని పెరిక భవన నిర్మాణానికి పాటుపడాల్సిందిగా కోరారు



People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**మల్లు భట్టి విక్రమార్క**




**వనపర్తి, అక్షిత ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. సోమవారం హైదరాబాదు నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సహచర మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్, సిఎస్ రామకృష్ణారావుతో కలిసి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాల పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో పాటు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య వీసీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఎన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ మంజూరయ్యాయి వాటి నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయి అనే వివరాలను ఆరా తీశారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ మంజూరయి ఇంకా వాటికి భూ కేటాయింపు జరగని నియోజకవర్గాల్లో కలెక్టర్లు చొరవ తీసుకొని వేగంగా భూమి కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే శంకుస్థాపన పూర్తయిన జిల్లాల్లో నిర్మాణ పనులు వేగంగా కొనసాగించాలని సూచించారు.



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అనేది ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అంశమని, అన్ని వర్గాల విద్యార్థులని సకల సౌకర్యాలతో ఒకచోట చదువుకునే విధంగా చేసిందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. కాబట్టి ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునే విధంగా నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి ప్రభుత్వం వీటిని నిర్మాణం పూర్తి చేయాలని భావిస్తుందని ఆ దిశగా పనులు ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక సౌకర్యాలతో, సకల మౌలిక సదుపాయాలు ఉండేలా నిర్మాణం చేపట్టాలని సూచించారు. నిర్మాణ పనుల్ని జిల్లా కలెక్టర్లు నెలకొకసారి ప్రత్యక్షంగా పర్యటించి పరిశీలించాలని సూచించారు. వారానికి ఒకసారి ఆన్లైన్ ద్వారా పాఠశాలలో నిర్మాణ పనుల్ని సమీక్షించాలన్నారు. పనులు అత్యంత నాణ్యవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డీఈవో అబ్దుల్ ఘని, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

**మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నీలం మధు ముదిరాజ్**

**చిట్కుల్‌లో ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు**



**పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి:** దేశ జాతిని జాగృతం చేస్తూ,నేటి యువతే దేశ భవిష్యత్తుకు పునాది అని యువతలో స్ఫూర్తి నింపుతూ మన దేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తంగా ఇనుమడించేలా చేసిన విశ్వగురువు స్వామి వివేకానంద అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని సోమవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చిట్కుల్ ఎన్.ఎం.ఆర్ క్యాంపు కార్యాలయంలో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ రామకృష్ణ పరమహంసకు ప్రియ శిష్యుడైన వివేకానంద దేశంలో హిందూ మతం పునరుజ్జీవనంలో ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు.పాశ్చాత్య ప్రపంచానికి భారతీయ వేదాంతం,ఆధ్యాత్మికత,యోగా,తత్వాలను పరిచయం చేయడంలో కీలకపాత్ర పోషించి మన దేశ గొప్పతనాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పారని కొనియాడారు.భారతదేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్న విశ్వాసాన్ని బలంగా నమ్మి ఆత్మవిశ్వాసం,ధైర్యం, కార్యదక్షత కలిగిన పౌరులుగా తయారు చేశారన్నారు.నేటి పోటీ ప్రపంచంలో చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం ఎంత ముఖ్యమో ఆయన ఆనాడే గుర్తించి యువతకి బోధనలు చేశారని అన్నారు,ఆ మహనీయుడి జన్మదినాన్ని దేశ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామని,ఆయన స్ఫూర్తితో యువత ఒక లక్ష్యాన్ని ఎంచుకుని,క్రమశిక్షణతో,నిబద్ధతతో ముందుకు సాగితే విజయం తథ్యమని అభివర్ణించారు.ఆ మహనీయుడు అందించిన సందేశం నుంచి యువత స్ఫూర్తి పొంది తమ భవిష్యత్తు ని బంగారుమయం చేసుకొవడంతో పాటు దేశ అభివృద్ధికి చేయూతనందించాలని పిలుపునిచ్చారు,ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు,స్థానిక నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వివేకానంద 164వ జయంతి వేడుకలు



**ఆత్మకూర్(ఎం)అక్షిత న్యూస్:** మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం లో భాగంగా ఆత్మకూర్ గ్రామపంచాయతీ లో స్వామి వివేకానంద 164 వ జయంతి ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలదండ వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ గ్రామ ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్,కార్యదర్శి అంబోజు శేఖర్,వార్డ్ మెంబర్లు బూడిద శేఖర్ గౌడ్,రాగటి మత్స్యగిరి, గట్టు విశాల్,ఎలగందుల సైదులు,కొంగరి పుష్ప,రంగా సంధ్యారాణి,తవిటి శైలజ, కూరెళ్ల అనిల్,గ్రామ కారోబార్ కూరెళ్ల కిష్టయ్య,సిబ్బంది లక్షమయ్య,ఉగ్గే నరేష్,మజ్జిగ రాంబాబు,తవిటి రాజు తదితరులు పాల్గొన్నారు.

# మెడికవర్‌లో అరుదైన స్టమక్ క్యాన్సర్ చికిత్స విజయవంతం



**హనుమకొండ, అక్షిత ప్రతినిధి:** వరంగల్ మెడికవర్ హాస్పిటల్‌లో మరోసారి వైద్యులు తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. ప్రాణాంతకమైన కడుపు క్యాన్సర్‌తో బాధపడుతున్న 55 ఏళ్ల వ్యక్తికి అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి, అతడికి కొత్త జీవితం అందించారు.కొన్ని వారాలుగా కడుపులో నొప్పి, జీర్ణ సమస్యలతో ఇబ్బంది పడుతున్న రోగి హాస్పిటల్‌కు చేరుకున్నాడు. సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డా. సునీల్ నాగుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎండోస్కోపీ, సీటీ స్కాన్ పరీక్షల్లో ప్రారంభ దశలోనే స్టమక్ క్యాన్సర్ ఉన్నట్టు గుర్తించారు. సమయానికి వ్యాధిని నిర్ధారించడంతో, శస్త్రచికిత్స ద్వారానే పూర్తిస్థాయి చికిత్స సాధ్యమని వైద్యులు నిర్ణయించారు. ఆంకాలజీ నిపుణుల సూచనల మేరకు డా. సునీల్ నాగుల నేతృత్వంలో టోటల్ గ్యాస్ట్రెక్టమీ విత్ డి 2 లింఫ్ నోడ్ డిసెక్షన్ శస్త్రచికిత్సను అత్యంత జాగ్రత్తగా నిర్వహించారు. ఆపరేషన్ అనంతరం రోగి ఆశించినదానికంటే వేగంగా కోలుకుని, ఆరోగ్యంగా హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయ్యారు. వరంగల్ ట్రైసిటీ ప్రాంతంలో ఇలాంటి అధునాతన గ్యాస్ట్రో ఇంటెస్టైనల్ క్యాన్సర్ శస్త్రచికిత్సలు పరిమిత కేంద్రాల్లో మాత్రమే అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలిపారు. మెడికవర్ హాస్పిటల్‌లో స్టమక్, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్లకు ఆధునిక సౌకర్యాలతో చికిత్సలు అందుతున్నాయని, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాలకూ క్యాన్సర్ వైద్యం అందించబడుతోందని హాస్పిటల్ యాజమాన్యం వెల్లడించింది. ఈ సందర్భంగా డా. సునీల్ నాగుల మాట్లాడుతూ, కడుపులో తరచూ నొప్పి, ఆకలి లేకపోవడం, తెలియని బరువు తగ్గడం, రక్తహీనత, తిన్న వెంటనే నిండిపోయిన భావన వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు అని ప్రజలకు సూచించారు.

## రెండేడ్లైనా నెరవేరని సీఎం హామీ

**14 ఏండ్లుగా వెట్టిచాకిరే..**



**కొడిమ్యాల, అక్షిత న్యూస్ :** తెలంగాణ సమగ్ర శిక్షలో గత 14 ఏండ్లుగా విధులు నిర్వర్తిస్తున్న సుమారు 22 వేల మంది తాత్కాలిక ఉద్యోగులు వారు చేస్తున్న ఉద్యోగంలో ఎలాంటి ఎదుగూ బొదుగూ లేకపోవడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విద్యాహక్కు చట్టం - 2009 అమలులో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2012 సంవత్సరంలో అప్పటి సర్వ శిక్ష అభియాన్ స్కీమ్ లో ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గౌరవ వేతనంతో ఈ ఉద్యోగులు నియమింపబడినారు. ప్రస్తుతం వీరి ఉద్యోగం పాకెట్ మనీకి సరిపోని గౌరవ వేతనంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరి సమస్యల పరిష్కారం కోసం గతంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు మార్లు నిరవధిక సమ్మె చేసినప్పటికీ నేటికీ ఏ పార్టీ ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ వీరి సమస్యలను పరిష్కరించిన పాపాన పోలేదు. ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు చేస్తున్న ఈ ఉద్యోగుల జీతం, జీవితం గూర్చి సమాజంలో చెప్పుకుంటే మానం, చెప్పుకోకుంటే ప్రాణం పోతుంది అన్న చందంగా వీరి భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా తయారయ్యింది. ప్రస్తుత తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గతంలో వీరి నిరవధిక సమ్మె శిబిరం వద్దకు వచ్చి మాట్లాడుతూ..మీకు ఉద్యోగాలు ఇచ్చింది అప్పటి మా కాంగ్రెస్ ప్రభుత్వమేనని కనుక మీ సమస్యలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే టీ త్రాగే సమయంలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చి రెండేండ్లైన సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

## ప్రజలు చెత్త డబ్బాలను వినియోగించుకోవాలి

**స్వచ్ఛభారత్.. స్వచ్ఛ తాజ్ పూర్**

**సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్**



**భువనగిరి/ అక్షిత న్యూస్:** స్వచ్ఛ భారత్ -స్వచ్ఛ తాజ్ పూర్...స్వచ్ఛ భారత్ లో భాగంగా స్వచ్ఛ తాజ్ పూర్ లక్ష్యంగా తాజ్ పూర్ గ్రామంలో సుమారు క్వింటాలు చెత్త మోయగల తడి చెత్త పొడి చెత్త ట్రాలీ చెత్త డబ్బాలను (డస్ట్ బిన్ )గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ , ఉపసర్పంచ్, వార్డు సభ్యులు సోమవారం రోజున ఏర్పాటు చేయడం జరిగింది... ఇందులో భాగంగా ఈ చెత్త డబ్బాలను (డస్ట్ బిన్ ) గ్రామంలో చెత్త సేకరణ వాహనం తిరగడానికి ఇబ్బంది గా ఉన్న గలీలలో, జనం ఎక్కువగా ఉండే చౌరస్తా లలో అధిక చెత్త జమయ్యే ప్రదేశాలలో ఉంచడానికి నిర్ణయించడమైనది.. కావున గ్రామ ప్రజలు తడి చెత్త -పొడి చెత్త ను సూచించిన డబ్బాలలో వేయవలెను.వాటిని వినియోగించు కోకుండా నిర్లక్ష్యం గా ఎక్కడ పడితే అక్కడ చెత్త చెదారం వేసినచో సీసీ కెమెరా ల ద్వారా పరిశీలించి వారికి గ్రామపంచాయతీ 500/-నుండి 1000/-వరకు జరిమానా వేయాలని నిర్ణయించడమైనది.. కావున గ్రామప్రజలు సహకరించి గ్రామాన్ని పరిశుభ్రత లో అగ్ర స్థానంలో ఉంచగలరని కోరుతున్నాము.. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, యువత, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తులు పరిష్కరించాలి

**రైస్ మిల్లుల అన్ని రకాల అనుమతులపై వివరాలు సేకరించి నివేదిక ఇవ్వండి**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి, అక్షిత ప్రతినిధి :** భూభారతిలో వచ్చిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తహశీల్దార్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో తహసిల్దార్లతో భూభారతి, రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పెండింగ్ పై సమీక్ష నిర్వహించారు. ఒక్కో మండలం వారిగా పెండింగ్ దరఖాస్తులపై వివరణ అడిగారు. భూభారతిలో 60 రోజులకు మించి తహసిల్దార్ లాగిన్ లో ఎందుకు పెట్టుకున్నారని ప్రశ్నించారు. వారం రోజుల్లో తహసిల్దార్ లాగిన్ నుండి క్లియర్ చేయాలని ఆదేశించారు. ఇప్పటికే కలెక్టర్ లాగిన్ కు పంపించిన వాటిలో కొన్నింటికి ఫిజికల్ ఫైల్ పంపకపోవడం పై ప్రశ్నించారు. పెండింగ్ మ్యుటేషన్, సక్సెషన్ దరఖాస్తులు 60 రోజుల వరకు తహసిల్దార్ లాగిన్ లో పెండింగ్ పెట్టుకోవాల్సిన ఆవశ్యకత ఏముందని ప్రశ్నించారు. వారం రోజుల్లో తహసిల్దార్ లాగిన్ లో ఉన్న భూభారతి దరఖాస్తులు సాధ్యమైనన్ని పరిష్కరించాలని, ఆర్డీఓ, అదనపు కలెక్టర్, కలెక్టర్ లాగిన్ కు పంపాల్సినవి తగిన రికార్డులతో పంపించాలని ఆదేశించారు.రెవెన్యూ సదస్సు సందర్భంగా వచ్చిన దరఖాస్తులను సైతం త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా మండలాల్లో ఉన్న రైస్ మిల్లుల పూర్తి వివరాలు సేకరించి నిర్ణిత ప్రొఫార్మాలో జిరాక్స్ ప్రతులు జత చేసి వారం రోజుల్లో నివేదిక పంపించాలని తహసీల్దార్లను ఆదేశించారు. జిల్లాలో ఎస్.ఐ.ఆర్ కు సంబంధించి మండలాల వారిగా ఓటరు ప్రోజెన్సీ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి బి.ఎల్ ఓ రోజుకు కనీసం 10 మ్యాపింగ్ లు పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించే అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆర్డీఓ సుబ్రమణ్యం, అందరూ తహసీల్దార్లు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

## యువశక్తికి స్ఫూర్తి స్వామి వివేకానంద

**జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు**



**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** యువశక్తికి స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద అని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం స్వామి వివేకానంద 163 వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా యువజన క్రీడా సేవల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవ వేడుకలలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా యువజన క్రీడా సేవల శాఖ అధికారి అశ్వక్ అహ్మద్ లతో కలిసి హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువశక్తికి స్ఫూర్తిదాయకుడు వివేకానంద అని అన్నారు. భారతీయ ఆధ్యాత్మిక విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పిన గురువు, తన ఉపన్యాసాలతో జగతిని జాగృతం చేసిన మహా మేధావి అని తెలిపారు. "సత్యమే నా దైవం - విశ్వమే నా దేశం" అని నమ్మి బానిసత్వంలో మగ్గిపోతున్న దేశ ప్రజలను మేల్కొలిపి సామాజిక అసమానతలపై శంఖం పూరించారని తెలిపారు. యువత తమ శక్తిని సమాజ హితానికి వినియోగించి దేశభక్తి, సేవా భావాన్ని విస్తరించాలని, దేశ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా జిల్లా కేంద్రం లో బీజేపీ మరియు వాసవి క్లబ్ ల ఆధ్వర్యం లో వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విడివిడిగా స్థానిక వివేకానంద చౌక్ వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**



**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. కాగజ్ నగర్ పట్టణంలోని సంఘంబస్తికి చెందిన సాహన్ మహమ్మద్ తనకు ఆసరా పింఛన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. జైనూర్ మండలం పార గ్రామానికి చెందిన ఆత్రం నిర్మల తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన రైతులు వట్టివాగు కాలువను కొంతమంది అక్రమంగా ఆక్రమించుకుంటున్నారని, ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. సిర్పూర్ టి మండలం హుడ్కిలి గ్రామానికి చెందిన చందనఖడే భాగ్యశ్రీ తనకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. వాంకిడి మండలం నవేగాం సర్పంచ్ సుజాత తమ గ్రామానికి రహదారి మంజూరు చేసి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్ నగర్ మండలం నజ్రుల్ నగర్ గ్రామానికి చెందిన చంద్రకాంత మేస్త్రి తనకు జారీ చేసిన పట్టాదారు పాసుపుస్తకం లో విస్తీర్ణము సవరణ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ మండలం వంజరి గ్రామానికి చెందిన దుర్గం దశరథ్ తనకు బారేగూడ గ్రామ శివారులో గల పట్టా భూమి ఇతరుల పేరిట చూపిస్తుందని, సవరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైనూర్ మండలం వార గ్రామానికి చెందిన మిశ్రమం తుర్సబాయి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై వస్తున్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.